# ఓలా నుంచి తొలి మోటార్‌సైకిల్




*సింగిల్ చార్జింగ్‌తో 200 కి.మీ నుంచి 579 కి.మీ వరకు..*

కృష్ణగిరి(తమిళనాడు), ఆగస్టు 15: ఎలక్ట్రిక్ స్కూటర్ల తయారీ సంస్థ ఓలా గ్రూపు తాజాగా.. ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్ విభాగంలోకి అడుగుపెట్టింది. ఒకేసారి మూడు మాడళ్లను విడుదల చేసిన సంస్థ..మరో రెండు మాడళ్లను విడుదల చేయబోతున్నట్లు ప్రకటించింది. కృత్రిమ మేధస్సు టెక్నాలజీతో రూపొందించిన ఈ బైకులను 'సంకల్ప 2024' వేదికగా జరిగిన వార్షిక సమావేశంలో కంపెనీ ఫౌండర్ అగర్వాల్ విడుదల చేశారు. మూడు రకాల్లో లభించనున్న ఈ మోటార్‌సైకిళ్లు రూ.1,99, 999 గరిష్ఠ ధరలో లభించనున్నాయి. వీటిలో రోడ్‌స్టర్ ఎక్స్ మాడల్ రూ.74,999 నుంచి రూ.99,999 లోపు, రోడ్‌స్టర్ రూ.1,04, 999 నుంచి రూ.1,19, 999 లోపు, రోడ్‌స్టర్‌ప్రో మాడల్ ధర రూ.1,99, 999 నుంచి రూ.2,49,999కి లభించనున్నాయి. ఈ బైకులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం నుంచి డెలివరీ చేయనున్నట్లు ప్రకటించింది. కానీ, రోడ్‌స్టర్ ప్రో మాత్రం వచ్చే ఏడాది నాలుగో త్రైమాసికం(మార్చి 2026) నుంచి అందుబాటులోకి రానున్నట్లు అగర్వాల్ చెప్పారు.

**రోడ్‌స్టర్ ప్రో:**

- 52 కిలోవాట్ల బ్యాటరీతో తీర్చిదిద్దిన ఈ మాడల్ కేవలం 1.9 సెకండ్లలో 60 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్నది. గంటకు 194 కిలోమీటర్లు ప్రయాణించే ఈ బైకు సింగిల్ చార్జింగ్‌తో 579 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. 10 ఇంచుల టీఎఫ్‌టీ టచ్‌స్క్రీన్, డిస్క్ బ్రేక్‌తో ఏబీఎస్ వంటి ఫీచర్స్ ఉన్నాయి.

**రోడ్‌స్టర్**

- 2.5 కిలోవాట్లు, 3.5 కిలోవాట్లు, 4.5 కిలోవాట్ల బ్యాటరీతో తయారైన ఈ బైకు కేవలం 2.8 సెకండ్లలోనే 40 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్నది.
- గంటకు 124 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోయే ఈ బైకు సింగిల్ చార్జింగ్‌తో 248 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.

# భారత్‌లోకి బీఎస్‌ఏ మోటార్‌సైకిళ్లు




**గోల్డ్ స్టార్ 650 ధర రూ.2.99 లక్షలు**

ముంబై, ఆగస్టు 15: దేశీయ రోడ్లపై మరో అంతర్జాతీయ మోటార్‌సైకిల్ బ్రాండ్ దూసుకుపోవడానికి సిద్ధమైంది. మహీంద్రా గ్రూపు నిర్వహిస్తున్న ఐకానిక్ మోటార్‌సైకిల్ బ్రాండ్ బీఎస్‌ఏ తన తొలి మోటార్‌సైకిల్‌ను దేశీయ మార్కెట్‌కు పరిచయం చేసింది. 652 సీసీ సామర్థ్యంతో రూపొందించిన గోల్డ్ స్టార్ 650 మాడల్ ధర రూ.2.99 లక్షలు. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. ప్రపంచంలో అతి పురాతన మోటార్‌సైకిల్ సంస్థయైన బిర్మింఘమ్ స్మాల్ ఆర్మ్స్ కంపెనీ(బీఎస్‌ఏ)ను తొమ్మిదేండ్ల క్రితం మహీంద్రా గ్రూపు కొనుగోలు చేసింది. ఇప్పటికే ఈ సంస్థ దేశీయంగా జావా, యెజ్డీ మోటార్‌సైకిళ్లను విక్రయిస్తున్నది. దీంట్లోభాగంగా బ్రిటన్‌లో 2021లో విడుదల చేసిన బీఎస్‌ఏ గోల్డ్ స్టార్ 650 మాడల్ ఇప్పటికే టర్కీ, న్యూజిలాండ్, ఫిలిప్పీన్స్‌ల్లో విక్రయిస్తున్న ఈ బైకును తాజాగా దేశీయ మార్కెట్లోకి అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సందర్భంగా మహీంద్రా గ్రూపు చైర్మన్ ఆనంద్ మహీంద్రా మాట్లాడుతూ.. అంతర్జాతీయ బ్రాండ్‌గా వెలుగొందుతున్న బీఎస్‌ఏ బ్రాండ్‌ను భారత్‌కు తీసుకురావడం ఎంతో సంతోషంగా ఉన్నదన్నారు. భవిష్యత్తులో అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్ మార్కెట్లో కూడా ఈ బ్రాండ్‌ను ప్రవేశపెట్టబోతున్నట్లు ప్రకటించారు.

# ఖాతా లేకున్నా చెల్లింపులు

## త్వరలో డెలిగేటెడ్ పేమెంట్ సిస్టమ్

## అందుబాటులోకి రానున్న యూపీఐ కొత్త ఫీచర్లు

ముంబై, ఆగస్టు 15: బ్యాంక్ ఖాతా లేకున్నా.. మొబైల్స్‌లో ఆన్‌లైన్ పేమెంట్స్‌ను చేసుకునే సౌకర్యం రానున్నది. నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ).. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సర్వీస్‌ను అప్‌గ్రేడ్ చేసే పనిలో ఉన్నది మరి. ఇటీవలి ద్రవ్య సమీక్షలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రకటించినట్టుగానే యూపీఐ సేవల్లో కొత్త ఫీచర్లను ప్రవేశపెట్టే దిశగా ఎన్‌పీసీఐ అడుగులేస్తున్నది. ఇందులో భాగంగానే కొత్తగా డెలిగేటెడ్ పేమెంట్ సిస్టమ్‌ను పరిచయం చేస్తున్నది.




### ఏమిటీ కొత్త సిస్టమ్?

ప్రస్తుతం యూపీఐ పేమెంట్స్.. బ్యాంక్ ఖాతాదారులకే అందుబాటులో ఉన్నాయి. గూగుల్ పే, ఫోన్‌పే, పేటీఎం, భారత్ పే ఇలా ఏ యూపీఐ సర్వీస్‌ను వాడాలన్నా.. బ్యాంక్ ఖాతా తప్పనిసరి. వినియోగదారుల బ్యాంక్ ఖాతాలకు వారి మొబైల్ నెంబర్, ఆధార్ నెంబర్ లింకైతేనే యూపీఐ అకౌంట్స్ యాక్టీవేట్ అయ్యేవి. అయితే ఇకపై బ్యాంక్ ఖాతా లేనివారూ తమ మొబైల్స్ ద్వారా యూపీఐ పేమెంట్లు చేసుకునేలా ఓ నయా డెలిగేటెడ్ పేమెంట్ సిస్టమ్‌ను ఎన్‌పీసీఐ తీసుకువస్తున్నది. యూపీఐ అకౌంట్ ఉన్న వ్యక్తి అనుమతితో వారి కుటుంబ సభ్యులు, ఇతరులు బ్యాంక్ ఖాతా లేకున్నా.. ఆన్‌లైన్ పేమెంట్స్ చేసుకునే అవకాశాన్ని ఈ కొత్త సిస్టమ్ కల్పిస్తున్నది.

**ఉదాహరణకు..**

ఓ కుటుంబంలో బ్యాంక్ ఖాతా ఉన్న ఓ వ్యక్తి యూపీఐ పేమెంట్స్‌ను వాడుతున్నారు. అప్పుడు మిగతా కుటుంబ సభ్యులూ అదే యూపీ అకౌంట్‌కు తమ మొబైల్ ఫోన్లను లింక్ చేసుకుని సదరు బ్యాంక్ ఖాతా నుంచే యూపీఐ పేమెంట్స్ చేసుకోవచ్చు. దీన్నె డెలిగేటెడ్ పేమెంట్ సిస్టమ్ అంటారు. అయితే సేవింగ్స్ బ్యాంక్ అకౌంట్‌దారులకే ఈ అవకాశం ఉన్నది. క్రెడిట్ కార్డులు, ఇతర ఆర్థిక సాధనాలకు ఇది వర్తించదు. ఈ కొత్త ఫీచర్‌కు సంబంధించిన విధివిధానాలను ఎన్‌పీసీఐ త్వరలో ప్రకటిస్తుంది. దీనివల్ల యూపీఐ ద్వారా చెల్లింపులు మరో 25 నుంచి 30 శాతం పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. బ్యాంక్ ఖాతా లేనివారు ఇప్పటికీ నగదు లావాదేవీలపైనే ఆధారపడుతున్నారు. వారినీ డిజిటల్ ఎకానమీలో భాగస్వాముల్ని చేయడానికి డెలిగేటెడ్ పేమెంట్ సిస్టమ్ దోహదపడుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే ఫేస్ అన్‌లాక్ ఫీచర్‌నూ పరిచయం చేయాలని ఎన్‌పీసీఐ చూస్తున్నది.

### తగ్గిన పసిడి దిగుమతులు

న్యూఢిల్లీ, ఆగస్టు 15: బంగారం దిగుమతులు క్రమంగా తగ్గుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లో పసిడి దిగుమతులు ఏడాది ప్రాతిపదికన 4.23 శాతం తగ్గి 12.64 బిలియన్ డాలర్లకు పడిపోయాయని కేంద్ర ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. అంతర్జాతీయ దేశాలు అనిశ్చిత పరిస్థితి నెలకొనడం ఇందుకు కారణమని తన నివేదికలో పేర్కొంది. అధిక ధరల కారణంగా బంగారాన్ని కొనుగోలు చేయడానికి సామాన్యుడు వెనకడుగు వేస్తున్నారని, దీంతో దిగుమతులు తగ్గుముఖం పట్టాయని పేర్కొంది. వచ్చేది పండుగ సీజన్ కావడంతో మళ్లీ దిగుమతులు పెరిగే అవకాశం ఉన్నదని తెలిపింది. బంగారంతోపాటు వెండిపై దిగుమతి సుంకాన్ని 15 శాతం నుంచి 6 శాతానికి తగ్గించింది.

### ఇండిగోలో పెరగనున్న మహిళా పైలట్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 15: దేశీయ అతి పెద్ద విమానయాన రంగ సంస్థ ఇండిగోలో మహిళా పైలట్లు మరింత పెరగనున్నారు. ప్రస్తుతం 800 మందికిపైగా మహిళా పైలట్లు పనిచేస్తున్నారీ సంస్థలో. అయితే వచ్చే ఏడాది ఆగస్టు కల్లా మరో 200 మందిని నియమించుకుంటామని, వెయ్యి మంది మహిళా పైలట్లే తమ లక్ష్యమని గురువారం సంస్థ తెలియజేసింది. రోజూ 2 వేలకు పైగా విమాన సర్వీసులను ఇండిగో నడిపిస్తున్నది. సంస్థలో 5 వేలకుపైగా పైలట్లున్నారు.

# ఎస్బీఐ వడ్డీరేట్ల పెంపు

*10 బేసిస్ పాయింట్లు పెరిగిన ఎంసీఎల్‌ఆర్ • గృహ, వాహన, వ్యక్తిగత రుణాలు పిరం*




ముంబై, ఆగస్టు 15: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) వడ్డీరేట్లను పెంచింది. అన్ని కాలపరిమితులపై మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేటు (ఎంసీఎల్‌ఆర్)ను 10 బేసిస్ పాయింట్ల చొప్పున పెంచుతున్నట్టు గురువారం ప్రకటించింది. పెరిగిన వడ్డీరేట్లు తక్షణమే అమల్లోకి వస్తాయని కూడా బ్యాంక్ స్పష్టం చేసింది. దీంతో గృహ, వాహన, వ్యక్తిగత తదితర రుణాలు ప్రియం కానున్నాయి. వీటి ఈఎంఐలు మరింత భారమైపోతున్నాయి.



**ఎస్బీఐ ఎంసీఎల్ఆర్‌లో మార్పులు ఇలా..**

| కాలపరిమితి | మునుపు | ఇకపై |
|---|---|---|
| ఓవర్‌నైట్ | 8.10% | 8.20% |
| ఒక నెల | 8.35% | 8.45% |
| మూడు నెలలు | 8.40% | 8.50% |
| ఆరు నెలలు | 8.75% | 8.85% |
| ఏడాది | 8.85% | 8.95% |
| రెండేండ్లు | 8.95% | 9.05% |
| మూడేండ్లు | 9.00% | 9.10% |

**ఇదీ సంగతి..**

అన్ని రకాల రుణాలపై వడ్డీరేట్ల నిర్ణయానికి ఎంసీఎల్‌ఆర్‌నే ప్రామాణికంగా బ్యాంకులు తీసుకుంటున్నాయిప్పుడు. ఫలితంగా ఎంసీఎల్‌ఆర్‌ను బ్యాంకులు పెంచిన ప్రతీసారీ రుణగ్రహీతలు తమ నెలవారీ కిస్తీలను ఇంకా ఎక్కువగా చెల్లించాల్సి వస్తున్నది. లేదంటే రుణ కాలపరిమితైనా పెరుగుతున్నది. నిజానికి ఇలా వడ్డీరేట్లను ఎస్బీఐ పెంచడం వరుసగా ఇది మూడో నెల కావడం గమనార్హం. ఇతర పోటీ బ్యాంకులూ వడ్డీరేట్లను పెంచుతుండగా.. ఈ తరహా విధానాలు మార్కెట్‌లో రుణ లభ్యతను కఠినతరం చేస్తున్నాయి.

**రెపో స్థిరంగా ఉన్నా..**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కీలక వడ్డీరేట్లను ఏడాదిన్నరగా యథాతథంగానే ఉంచుతున్నది. వరుసగా రెపో రేటును పెంచుతూపోయిన ఆర్బీఐ.. గత ఏడాది ఫిబ్రవరిలో చివరిసారిగా పెంచింది. 6.25 శాతం నుంచి 6.50 శాతానికి తీసుకెళ్లింది. అప్పట్నుంచి ఇప్పటిదాకా అదే వడ్డీరేటు నడుస్తున్నది. రెండు నెలలకోసారి ద్రవ్య విధాన పరపతి సమీక్షలు చేస్తున్నా.. ద్రవ్యోల్బణం అదుపు సాకుతో వడ్డీరేట్ల జోలికి వెళ్లకుండానే సమావేశాన్ని ముగించేస్తున్నది. అయితే బ్యాంకులు మాత్రం రుణాలపై వడ్డీరేట్లను పెంచుతూనే ఉన్నాయి. ఈ నెల 12 నుంచి బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్‌లు రుణాలపై వడ్డీరేట్లను పెంచగా.. ఆగస్టు 10 నుంచే యూకో బ్యాంక్ పెంచేసింది. తాజాగా పంద్రాగస్టు సందర్భంగా ఎస్బీఐ వడ్డించింది. బ్యాంకుల తీరు.. తమకు ఇబ్బందికరంగా ఉంటున్నదని ఆటో, నిర్మాణ, దాని అనుబంధ రంగాలు వాపోతున్నాయి. ఇకనైనా రెపో రేటును ఆర్బీఐ తగ్గించాలని, అప్పుడు బ్యాంకులూ వడ్డీరేట్లను తగ్గిస్తాయని అటు వ్యాపారులు, ఇటు రుణగ్రహీతలు అంటున్నారు.



# నయా మహీంద్రా థార్

**ప్రారంభ ధర రూ.12.99 లక్షలు**

కొచ్చి, ఆగస్టు 15: దేశంలో అత్యంత వేగవంతంగా దూసుకుపోతున్న మధ్యస్థాయి స్పోర్ట్స్ యుటిలిటీ వాహన సెగ్మెంట్‌లో అగ్రస్థానం లక్ష్యంగా మహీంద్రా అండ్ మహీంద్రా అడుగులు వేస్తున్నది. ఈ విభాగంలో ఇప్పటికే పలు మాడళ్లను విడుదల చేసిన సంస్థ.. తాజాగా ఐదు డోర్లు కలిగిన థార్ రాక్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 1997-2184 సీసీ సామర్థ్యంతో రూపొందించిన ఈ కారులో ఐదుగురు కూర్చోవడానికి వీలుంటుంది. ఈ మాడల్ ప్రారంభ ధర రూ.12.99 లక్షలు కాగా, గరిష్ఠంగా రూ.20.49 లక్షలకు లభించనున్నది. ఈ నయా మాడల్‌కు అక్టోబర్ 3 నుంచి బుకింగ్‌లు ఆరంభించనున్న సంస్థ.. దసరా (అక్టోబర్ 12) నుంచి బుకింగ్ చేసుకున్నవారికి అందచేయనున్నది. వచ్చే మూడు నుంచి ఐదేండ్లలో తొలి స్థానం లక్ష్యంగా థార్ రాక్స్ మాడల్‌ను ప్రవేశపెట్టినట్లు మహీంద్రా ఈడీ, సీఈవో రాజేశ్ జేజురికర్ తెలిపారు. ఈ నూతన మాడల్‌ను అభివృద్ధి చేయడానికి, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించడానికి సంస్థ రూ.1,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టినట్లు చెప్పారు. ప్రస్తుతానికి ఈ మాడల్‌ను దేశీయంగా మాత్రమే విక్రయించనున్నట్లు, ఎగుమతి చేసే ఆలోచన లేదని ఆయన స్పష్టంచేశారు.


